క్లుప్తంగా

బహిరంగ సభను జయప్రదం చేయండి

బీజేపీ నాయకుడు లక్ష్మణ్

తుక్కుగూడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని తుక్కుగూడలో నిర్వహించే బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తుక్కుగూడ మున్సిపాలిటీ ఆ పార్టీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తుక్కుగూడలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ శనివారం మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించడానికి నిర్వహిస్తున్న బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలు హాజరవుతారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ సభకు మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి సిఫార్సు చేయండి

వేతన సవరణ సంఘానికి ప్రభుత్వ పెన్షనర్ల విజ్ఞప్తి

వనస్థలిపురం: పే–రివిజన్ కమిషన్ ద్వారా తమ సమస్యలపై ప్రభుత్వానికి తగు సిఫార్సులు చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు కమిటీ సభ్యులు.. వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్.శివశంకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల జేఏసీ చైర్మన్ కె.లక్ష్మయ్య మాట్లాడుతూ, పెన్షనర్లకు బకాయి పడ్డ మూడు కరువు భత్యాలను విడుదల చేసిన తర్వాతే తమ మూల పెన్షన్‌పై ఫిట్‌మెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఐఆర్‌ను 5 శాతం నుంచి 15 శాతానికి పెంచాలని, డీఏ/డీఆర్‌ల విడుదలలో జాప్యం తగ్గించాలని, పెన్షనర్లకు నగదు రహిత చికిత్సకు అవకాశం కల్పించాలని, వైద్య ఖర్చుల కోసం ఇచ్చే రీయింబర్స్‌మెంట్‌ను రూ. 5 లక్షల వరకు పెంచాలని కోరారు. ఈ సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వానికి తగు సూచనలు అందజేయాలని సంఘం చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు సూర్యనారాయణ, కృష్ణమూర్తి, రాజేంద్రబాబు, భరత్‌రెడ్డి, మాన య్య, పుల్లయ్య, జ్ఞానేశ్వర్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

హస్తినాపురం: కారులో అక్రమంగా మద్యాన్ని తరలిస్తు న్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘ టన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ బొమ్మలగుడి ప్రాంతంలో నివసించే సింగిరెడ్డి మురళీధర్‌రెడ్డి కారులో మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటోనగర్ వద్ద కారును ఆపి తనిఖీ చేశారు. అక్రమంగా తరలిస్తున్న 22 సిగ్నిచర్ ఫుల్‌బాటిళ్లు, 10 బ్లాక్ అండ్ వైట్ ఫుల్‌బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సెల్‌ఫోన్ల రికవరీ

ఇబ్రహీంపట్నం: మొబైల్ ఫోన్లు చోరీకి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం సీఐ గోవింద్‌రెడ్డి తెలిపారు. ఇటీవల చోరీకి గురైన, పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులైన నాగరాజు, శివకు శుక్రవారం అందజేశారు. సీఐ మాట్లాడుతూ.. రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అందుబాటులోకి తీసుకొచ్చిన సీఈఐఆర్ యాప్‌తో మొబైల్‌ఫోన్ల రికవరీ సులభతరమైందన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మొబైల్ ఫోన్లను చాలావరకు 20 రోజుల్లోనే రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ ఫోన్ల రికవరీకి కృషిచేసిన డీఐ బబ్యానాయక్, కానిస్టేబుల్ విఠ, బాబూరావు, క్రైమ్ స్టాఫ్ నగేష్, కోటేశ్వర్‌రావును ఆయన అభినందించారు.

జాతరకు ముస్తాబు

ఆరు రోజుల పాటు ఉత్సవాలు

కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండిలో కొలువై ఉన్న మైసిగండి మైసమ్మ ఆలయ జాతర ఉత్సవాలు ఈనెల 27 నుంచి ఆరురోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జరిగే మైసమ్మ జాతరకు జిల్లా నుంచే కాకుండా తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై మైసిగండి ఆలయం ఉండటంతో ప్రతి నిత్యం భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ప్రత్యేకించి ఆది, మంగళ, గురువారాల్లో వేల సంఖ్యలో అమ్మవారి దర్శనానికి భక్తులు వస్తుంటారు. జాతర ఉత్సవాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రవాణా సదుపాయం..

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మైసిగండి మైసమ్మ ఆలయం ఉంది. హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి ప్రతి 5 నిమిషాలకు ఈ ఆలయం వద్దకు చేరుకునేందుకు బస్సు సౌకర్యం కలదు. అదే విధంగా నల్లగొండ ఎక్స్ రోడ్, ఐఎస్ సదన్, సంతోషనగర్, చంద్రయాణగుట్ట నుంచి ప్రతి 10 నిమిషాలకు బస్సులు కలవు. కల్వకుర్తి, నాగర్ కర్నూల్, అచ్చంపేట్ నుంచి కూడా బస్సు సౌకర్యం ఉంది.

కష్టసుఖాల్లో తోడుగా ఉంటా


శ్రీరాములు సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు


ప్రచారం చేస్తున్న శ్రీరాములు సతీమణి అండాలు, కుమార్తె శిరీష

బీజేపీతోనే అభివృద్ధి

- అవినీతి బీఆర్‌ఎస్‌ను ఓడించండి
- శ్రీరాములు యాదవ్ పిలుపు

తుక్కుగూడ: బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆ పార్టీ కౌన్సిలర్ శివకుమార్ ఆధ్వర్యంలో శ్రీరాములు సమక్షంలో బీజేపీ చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని, ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మాధవరెడ్డి, యువకులు తదితరులు ఉన్నారు.

శ్రీరాములును గెలిపించండి

మీర్‌పేట: అందెల శ్రీరాములు యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి అండాలు, కుమార్తె శిరీష కోరారు. శుక్రవారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 1, 2, 9, 19 డివిజన్లలో ఇంటింటికీ ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి.. 30వ తేదీన కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో స్థానిక నాయకులు జేడీ కుమార్, గడ్డం జగన్, కవిత, సునీత, మమతారెడ్డి, శిరీషరెడ్డి, సంగీత, మీనాక్షి, పద్మజ, ఎం.రఘు, డి.కృష్ణ, సీహెచ్.మల్లేశ్, ఎం.ఉపేందర్, సునీల్, శ్రీశైలం, సుధాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

పహాడీషరీఫ్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాకర్షక పథకాలు నచ్చి బీజేపీలో చేరేందుకు వివిధ పార్టీల నాయకులు ఉత్సాహం చూపుతున్నారని మామిడిపల్లి మాజీ కౌన్సిలర్ వేణుగౌడ్ తెలిపారు. శుక్రవారం రంగనాయకుల కాలనీకి చెందిన పలువురు వేణుగౌడ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో రోజు రోజుకు బీజేపీ బలపడుతోందని, శ్రీరాములు విజయం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. 25వ తేదీ (నేడు) తుక్కుగూడలో జరిగే ప్రధాని మోదీ సభను విజయవంత చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం

దిల్‌సుఖ్‌నగర్: శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి కోరారు. శుక్రవారం శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో చిత్ర లేఅవుట్ కాలనీ, సిరినగర్ కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధా ధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ 9 ఏళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రతి పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందన్నారు. బీజేపీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు రాములు యాదవ్, కరుణ, వెంకట్‌రెడ్డి, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదల అభయహస్తం

- కాంగ్రెస్ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి
- హస్తం గుర్తుకు ఓటేయాలని ప్రచారం


ఆమనగల్లు: వృద్ధురాలికి ఆరు గ్యారంటీలను వివరిస్తున్న కసిరెడ్డి

ఆమనగల్లు: పేద ప్రజలకు అండ.. కాంగ్రెస్ జెండా.. అని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హస్తం గుర్తు పేదల అభయహస్తమని తెలిపారు. కల్వకుర్తి, ఆమనగల్లు మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం కసిరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. నియంత, అవినీతి పాలన సాగిస్తున్న కేసీఆర్‌ను గద్దె దింపడమే తమ లక్ష్యమన్నారు. తనను ఆశీర్వదిస్తే కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాన్ని విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కల్వకుర్తి పట్టణంలోని వివిధ మసీదుల వద్ద ముస్లిం మైనార్టీలను కలసి హస్తం గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. అలాగే ఆమనగల్లు పట్టణంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు మానయ్య, జంగయ్య, కేశవులు, మల్లయ్య, ఖాదర్, కృష్ణనాయక్, సత్యం, శ్రీశైలం, అలీం, నాసర్, ఫరీద్, షర్ఫుద్దీన్, శ్రీకాంత్, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఆరుగ్యారెంటీలకు అద్భుత రెస్పాన్స్..

తలకొండపల్లి: వెనుకబాటుకు గురైన కల్వకుర్తిని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టంచేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు రాష్ట్రవ్యాప్తంగా మంచి రెస్పాన్స్ వస్తోందన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి తనను ఆశీర్వదించాలని కోరారు. సీనియర్ నాయకులు డేవిడ్ రేణురెడ్డి, రాజశేఖర్, యాదయ్య, వెంకట్రాంరెడ్డి, రాజిరెడ్డి, దశరథం, మహేశ్, దామోదర్, వెంకట్‌రెడ్డి, పవన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు..

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కర్కల్‌పహాడ్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం పలువురు నాయకులు హస్తం గూటికి చేరారు. రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో ఆంజనేయులు, గణేశ్, శివ, వంశీ, దయాకర్, విజేందర్, జగన్, రామకృష్ణ, జితేందర్, అస్లమ్, రమేశ్, ఫారుఖ్, నర్సింహ, వెంకటేశ్, జానీ, శేఖర్, జాకీర్, ఆమీర్, సమీర్, రాహుల్, మహేశ్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

మహేశ్వరం గడ్డ సబితారెడ్డి అడ్డా


మహేశ్వరంలో ప్రచారం చేస్తున్న మీనాజ్ పటేల్

మహేశ్వరం: మహేశ్వరం గడ్డ బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డి అడ్డా అని, ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చోటు లేదని ఆ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు మీనాజ్ పటేల్ తేల్చిచెప్పారు. ముస్లింల సంక్షేమానికి పాటు పడుతున్న ఆమెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మైనార్టీ బస్తీలో ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి సబితారెడ్డి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. మండల కేంద్రంలో మైనార్టీ భవనానికి స్థలం కేటాయించి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తెలిపారు. మసీదులు, దర్గా, ఈద్గాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు ఎండీ అజాం పలువురు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీఆర్‌ఎస్

హుడాకాంప్లెక్స్: పోలింగ్ తేదీ సమీపిస్తున్న తరుణంలో ఊరువాడ ప్రచారం హోరెత్తుతోంది. ఇంటింటి ప్రచారంలో పాటు ప్రధాన నాయకుల రోడ్‌షోలు, బహిరంగ సభలతో ఒక్క నిమిషం ఖాళీ లేకుండా బిజీ షెడ్యూల్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితారెడ్డిని గెలిపించాలని సరూర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం అంబేద్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, క్రాంతినగర్, డాక్టర్స్‌కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహేందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అనితారెడ్డి, అంకిరెడ్డి, దర్పల్లి అశోక్, లోకసాని కొండల్‌రెడ్డి, పోలె సుధామా, రుషిగుప్తా, రాఘవేంద్రగుప్తా, మల్లేశ్, సలీం తదితరులు పాల్గొన్నారు.


సరూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నేడు రావిర్యాలలో ప్రచారం

తుక్కుగూడ: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో సబితారెడ్డి రోడ్ షో నిర్వహిస్తారని బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్ తెలిపారు. రోడ్ షో అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

హుడాకాంప్లెక్స్: సీపీఐ మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మీర్‌పేట మాజీ సర్పంచ్ ఆర్. గోపాల్ శుక్రవారం బీఆర్‌ఎస్ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు ఎన్టీఆర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్–1, 2, లెనిన్‌నగర్‌కు చెందిన సీపీఐ నేతలు, ప్రజా సంఘాల నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ వేల కోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన సబితారెడ్డిని గెలిపించాలని కోరారు.

కేఎల్లార్ విజయం ఖాయం

మహేశ్వరం: మహేశ్వరంలో గడ్డపైన కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేఎల్లార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి సోనియాగాంధీకి కానుకగా ఇస్తామన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని తెలిపారు. అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15వేలు పంట పెట్టుబడి సాయం, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షల సాయం, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని తెలిపారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గోసుల హనుమంత్‌రెడ్డి, గోసుల వెంకట్‌రెడ్డి, గోసుల చంద్రశేఖర్‌రెడ్డి, కావలి శేఖర్‌తో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్, ఎండీ సాబీర్, యాదగిరి పలువురు పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్

కందుకూరు: కేఎల్లార్ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు మండలంలోని పులిమామిడి, ధన్నారం, చిపల్లపల్లి, మురళీనగర్, దావుద్‌గూడ, పెద్దమ్మతండా తదితర గ్రామాల్లో గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణా నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కేఎల్లార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సరికొండ మల్లేశ్, కప్పాటి పాండురంగారెడ్డి, సత్యానారాయణ, కృష్ణ, జగన్, సిద్ధేశ్వర్, శ్రీనివాస్ యక్ పాల్గొన్నారు.

పతి కోసం సతి ప్రచారం

బడంగ్‌పేట్: హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్)ను గెలిపించాలని ఆయన సతీమణి విజయలక్ష్మి అభ్యర్థించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్, వెంకటాపూర్, బాలాజీనగర్, గుర్రంగూడ, అల్మాస్‌గూడలో పీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత దంపతులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని తెలిపారు.


మల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న పారిజాత, విజయలక్ష్మి

జిల్లెలగూడలో కాంగ్రెస్ ప్రచారం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ వేంకటేశ్వరకాలనీ, న్యూ వెంకటేశ్వర కాలనీలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు సిద్ధాల శ్రీశైలం గడప గడపకూ ప్రచారం చేశారు. కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు శ్రీనివాస్, బొడ్డు మల్లేశ్, మేకల ఈశ్వర్, ఐలయ్య, సుభాశ్‌గౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని పీసీసీ సభ్యుడు జానకీరామ్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఆరు గ్యారంటీలను వివరిస్తూ.. హస్తం గుర్తుకు ఓటు వేసి కేఎల్లార్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


రఘుమారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష ఆదరణ

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా స్థానికుల ఆదరణను విశేషంగా చూరగొంటోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు, పరిసర కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు.

ప్రత్యంగిరా దేవికి కేఎల్లార్ పూజలు

మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) శుక్రవారం ఆర్‌కేపురం కాలనీలోని ప్రత్యంగిరా దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ కేఎల్లార్‌కుఆలయ జ్ఞాపికను అందజేశారు. – దిల్‌సుఖ్‌నగర్


ప్రత్యంగిరా దేవికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

సీఐ రాజశేఖర్



మాడ్గుల: ప్రజలందరూ ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని మాడ్గుల సీఐ రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ బలగాల కవాతు, పాత నేరస్తులను బైండోవర్ చేయడంతో పాటు సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దష్టి సారించామన్నారు. ప్రతి ఒక్క ఓటర్ స్వేచ్ఛగా ఓటేయాలన్నారు. ఎవరైనా అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. శాంతియుత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు.

ఎన్నికల సిబ్బందికి రెండురోజుల శిక్షణ

ఇబ్రహీంపట్నం: శేరిగూడ సమీపంలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో శని, ఆదివారాల్లో పీఓ, ఏపీఓలకు 3వ విడత శిక్షణ ఇవ్వనున్నట్లు ఇబ్రహీంపట్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. అదేవిధంగా అదే సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఎన్నికల సిబ్బంది వేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల విధి నిర్వహణలో పాల్గొనే ఇతర సిబ్బందికి శని, ఆది, సోమవారాల్లో, పోలీస్ వ్యక్తిగత సిబ్బందికి ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

- ఇబ్రహీంపట్నంలో నేతల విస్తృత ప్రచారం
- మల్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని ఉరూరా, గల్లీగల్లీల్లో తిరుగుతూ ఇంటింటి ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో కాంగ్రెస్ నాయకుడు బర్ల జగదీష్‌యాదవ్, చింతం బాల్‌రాజ్, కప్పరి రాజు, రాఘవేందర్, శశిధరప్ప, గౌస్,నరహరిల తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, అవినీతి పాలన చేస్తున్న కేసీఆర్‌ను గద్దె దించాలని ఈ సందర్భంగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే వంట గ్యాస్ తదితర ఆరు గ్యారంటీల స్కీమ్‌ల గురించి ప్రజలకు వారు వివరించారు.

డమ్మీ ఈవీఎంలతో ప్రచారం

డమ్మీ ఈవీఎంలను ఇంటింటికి తీసుకెళ్ళి ఓటర్లు చూపెడుతూ ఓటు ఏ విధంగా వేయాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వివరిస్తున్నారు. తమ అభ్యర్థి నెంబర్, గుర్తు, పేరు తదితర వివరాలను వారికి తెలియజేస్తూ పక్కవారికి ఓటు పడకుండా ఓటర్లను అప్రమత్తం చేస్తున్నారు. కప్పరి రాజు ఆధ్వర్యంలో పలు వార్డుల్లో డమ్మి ఈవీఎంలను తీసుకెళ్ళి తమ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి ఓటు వేయాలని మిట నొక్కిస్తున్నారు.

దండుమైలారంలో.....

దండుమైలారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నేతల ఇంటింటి ప్రచారం ఉపందుకుంది. ఆ పార్టీ నాయకులు మల్లేష్, హరినారాయణతోపాటు పలువురు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రచారాన్ని చేస్తున్నారు. ఫించన్‌దారులను ప్రత్యేకంగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన కుటుంబసభ్యులందరికి ఫించన్లు అందజేస్తామని తెలియజేస్తున్నారు.


ఇబ్రహీంపట్నం: ఓటర్లకు డమ్మీ ఈవీఎంలో మల్‌రెడ్డి గుర్తును చూపిస్తున్న నాయకులు

మల్‌రెడ్డిని గెలిపించండి

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ శుక్రవారం తుర్కయంజాల్‌లోని మసీద్ వద్ద ప్రచారం నిర్వహించారు. మైనార్టీలు, అన్నివర్గాల వారు కాంగ్రెస్‌కు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దర్శన్, నాయకులు శివకుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో ఇంటింటి ప్రచారం..

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆ పార్టీ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని నేతలు కోరారు. యాచారం, తక్కళ్లపల్లితండా, నల్లవెల్లి, మాల్, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో నమూనా బ్యాలెట్ పత్రాలతో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు జరిగి నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జహంగీర్, శ్రీనివాస్, గాలయ్య, శ్రీనువాస్‌నాయక్, నందునాయక్ తదితరులు పాల్గొన్నారు.